క్లుప్తంగా

ముంపు పొలాల పరిశీలన



పెద్దారాయుడుతోట(మొవ్వ): ముంపునకు గురైన రైతులు అధైర్యపడవద్దని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కాజ–పెద్దారాయుడు తోట మధ్య ముంపునకు గురైన పంట పొలాలను ఎమ్మెల్యే కైలే ఆదివారం పరిశీలించారు. మార్గం మధ్యలో ఉన్న రైతులను కలిసి అక్కడి పరిస్థితులను తెలుసుకుని, రైతులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ముంపు నీరు వేగంగా దిగువకు పారుతుందని, జరిగిన నష్టంపై అంచనాలు వేయిస్తామన్నారు. ఈ నివేదికను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఆదుకోవాలని కోరుతామని చెప్పారు.

కానుకొల్లులో వాటర్ ట్యాంక్ శుభ్రం



మండవల్లి: మండలంలోని కానుకొల్లు గ్రామంలో ఆదివారం వాటర్ ట్యాంక్, సంపులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగదాసి థామస్ మాట్లాడుతూ.. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా వాటర్ ట్యాంక్, సంపు శుభ్రం చేసి, స్వచ్ఛమైన తాగునీటిని అందజేస్తున్నామని చెప్పారు.

400 మందికి నేత్ర వైద్య పరీక్షలు



యలమర్రు(పెదపారుపూడి): మండలంలోని యలమర్రు గ్రామంలో అమరావతి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైదుల సహకారంతో 400 మంది రోగులకు ఆదివారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యుడు సూరపనేని సత్యనారాయణ మాట్లాడుతూ.. గ్రామంలో 400 మందికి పరీక్షలు నిర్వహించి, 175 మందికి కళ్లజోళ్లు ఇచ్చామన్నారు. మరో 100 మందికి ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. చలసాని రమేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో రోగికి ఎమ్మెల్యే కైలే పరామర్శ



తోట్లవల్లూరు: ఆపదలో ఉన్న వారికి వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని ఐలూరు గ్రామానికి చెందిన తుమ్మల పవన్‌కుమార్ కానూరు వద్ద రోడ్డు ప్రమాదానికి గురైన విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనిని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఆదివారం పరామర్శించి ధైర్యంగా ఉండాలని చెప్పారు. పవన్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ లతీఫ్‌హుస్సేన్ పాల్గొన్నారు.

బీజేపీ కార్యవర్గం ఎంపిక

గుడివాడటౌన్: భారతీయ జనతా పార్టీ గుడివాడ శాఖ నూతన కార్యవర్గ ఎంపిక ఆదివారం నిర్వహించినట్లు పట్టణ అధ్యక్షుడు ఎర్రపోతు అర్జున్ తెలిపారు. పట్టణ శాఖ ఉపాధ్యక్షులుగా ఆర్.కోటేశ్వరరావు, అశోక్ కుమార్ షా, కేకేడీ ప్రసాద్, సీహెచ్ ఆంజనేయులు, పి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు ఎం.సత్యనారాయణ, పి.మురళి, కోశాధికారి కె.తిరుపాల్ గుప్తా, కార్యదర్శులు పి.సాయి రమేష్, సీహెచ్ రాంబాబు, జి.రాజా, జి.సతీష్, డి.విద్యాధర్, పి.మురళీకృష్ణ, పి.శివప్రసాద్, ఎం.కుమార్, డి.గణపతిలను నియమించారన్నారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామినేని వెంకట కృష్ణ, అంగడాల సతీష్, సూరే గాంధీ తదితరులు అభినందించారు.

ముమ్మరంగా మురుగు తొలగింపు

- ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ చొరవతో చర్యలు
- కొనసాగుతోన్న గుర్రపు డెక్క, తూటికాడ తొలగింపు పనులు
- క్రమంగా తేరుకుంటున్న వరి పొలాలు



తోట్లవల్లూరులో ముంపు నుంచి తేరుకుంటున్న వరి పొలం

తోట్లవల్లూరు: అకాల వర్షాల కారణంగా నీటి ముంపులో చిక్కుకున్న వరి పొలాలు క్రమంగా తేరుకుంటున్నాయి. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదేశాలతో ఏనుగులకోడు డ్రెయిన్, దేవరపల్లి డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూటుకాడ, మురుగు తొలగింపు పనులను అధికారులు వేగవంతం చేయటంతో మురుగు సాఫీగా ముందుకు సాగుతోంది. వందలాది ఎకరాల్లోని ముంపునీరు ఆయా డ్రెయిన్ల ద్వారా బయటకు వెళుతుండటంతో రైతుల్లో నెలకొన్న ఆందోళన తొలగుతోంది. వివరాల్లోకి వెళితే.. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కారణంగా ఇటీవల కురిసిన అకాల వర్షాలతో అన్నదాతలకు ఇబ్బందులు వచ్చాయి. వరినాట్లు పూర్తి కావస్తున్న దశలో కురిసిన వర్షాలు కోలుకోలేని నష్టాన్ని కలిగించాయి. భారీగా కురిసిన వర్షాలతో రొయ్యూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, బొడ్డపాడు, చినపులిపాక, భద్రిరాజుపాలెం, చాగంటిపాడు, దేవరపల్లి, తదితర గ్రామాల పరిధిలో వందలాది ఎకరాల వరి పొలాలు నీటి ముంపునకు గురయ్యాయి.

యుద్ధప్రాతిపదికన జరిపేలా చర్యలు..

వర్షాలతో నీటి ముంపునకు గురైన వరి పొలాలను పామర్రు ఎమ్మెల్యే కైలే పరిశీలించటంతో పాటు డ్రెయినేజీ అధికారులను అప్రమత్తం చేశారు. తోట్లవల్లూరు వద్ద ఏనుగులకోడు డ్రెయిన్, దేవరపల్లి వద్ద దేవరపల్లి డ్రెయిన్లలో మురుగు ప్రవాహానికి అడ్డంకిగా మారిన గుర్రపు డెక్క, తూటుకాడ తొలగింపు పనులు యుద్ధప్రాతిపదికన జరిపేలా చర్యలు తీసుకున్నారు. దీంతో రెండు రోజులుగా పొక్లెయినర్‌లు ఏర్పాటు చేసి ఆయా డ్రెయిన్లలో గుర్రపుడెక్క, మురుగు తొలగింపు పనులను అధికారులు చురుగ్గా నిర్వహిస్తున్నారు.

ముందుకు పారుతున్న మురుగు..

ఏనుగులకోడు డ్రెయిన్, దేవరపల్లి డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూటుకాడ తొలగింపుతో మురుగు నీరు సాఫీగా ముందుకు పారుతోంది. ఆయా డ్రెయిన్‌ల పరిధిలోని వరి పొలాల్లో ముంపునీరు క్రమంగా బయటకు తరలివెళుతోంది. మెరక ప్రాంతాల్లోని వరి పొలాలు నీటిముంపు నుంచి బయటపడుతున్నాయి. పల్లపు ప్రాంతాల్లో పొలాలు మాత్రం పూర్తిగా పాడైపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరినాట్లు మళ్లీ వేయాలంటే నారు దొరికే పరిస్థితి లేదంటున్నారు. ముంపు తొలగింపునకు చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌కు రైతులు కృతజ్ఞతలు చెబుతున్నారు.

వర్షాలు తగ్గడంతో..

ముదినేపల్లిరూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో ముంపుబారిన పడ్డ వరిపొలాలు క్రమంగా తేరుకుంటున్నాయి. వర్షాలకు అనేక గ్రామాల్లో నేరుగా విత్తనాలు వెదజల్లు పద్ధతిలో సాగుచేసిన పొలాలన్నీ ముంపు బారిన పడ్డాయి. ప్రధానంగా వాడవల్లి, దేవపూడి, చినపాలపర్రు, కోడూరు, పెదపాలపర్రు, సింగరాయపాలెం గ్రామాల్లో వెదజల్లిన వరిచేలు వర్షాల వల్ల పూర్తిగా నీటమునిగాయి. నాలుగు రోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పొలాల్లోని నీరంతా మురుగు కాల్వల్లోకి ప్రవహిస్తుండడంతో వరి మొక్కలు బయటకు కనిపిస్తున్నాయి. మరో రెండు రోజుల్లో వర్షపు నీరు పొలాల్లో నుంచి పూర్తిగా తొలగిపోయే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. నీరు బయటకు పోయిన తరువాత తీసుకోవాల్సిన సంరక్షణ చర్యల గురించి వ్యవసాయాధికారులు ఇప్పటికే తెలియజేశారు.



తోట్లవల్లూరు వద్ద పంటబోదెలో పొక్లెయిన్‌తో గుర్రపుడెక్క తొలగిస్తున్న దృశ్యం



ఏనుగులకోడు డ్రెయిన్‌లో సాఫీగా ముందుకు సాగుతున్న మురుగు ప్రవాహం

శాంతించిన కృష్ణమ్మ



తోట్లవల్లూరు: కృష్ణమ్మ శాంతించింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో గత మూడు రోజులుగా ఉధృతంగా ప్రవహించిన విషయం విదితమే. విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి నీటి విడుదల తగ్గించటంతో ఆదివారం కృష్ణానదిలో నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పట్టింది. కృష్ణానదిలో వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో పల్లపు ప్రాంతాల్లో పంటలు సాగు చేస్తున్న రైతులు ఊపిరిపీల్చుకున్నారు. పాములలంకతో పాటు లంక గ్రామాలు, వ్యవసాయ పనుల కోసం లంకలకు వెళ్లే రైతులు, కూలీలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు.

నేడు చినపారుపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం

పెదపారుపూడి: మండలంలోని చినపారుపూడి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఇంటింటికీ వెళ్లి ప్రజా సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను పంపిణీ చేస్తారన్నారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని చెప్పారు.

మణిపూర్‌లో దాడులను నిరసిస్తూ శాంతి ర్యాలీలు

పామర్రు: ణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా పామర్రు నియోజకవర్గ స్థాయి పాస్టర్లు, రెవరెండ్స్, కల్వరీ వర్షిప్ సెంటర్ తదితర సంఘాల దైవజనులు, సువార్తికులు, యూత్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిరసన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా వారు పామర్రు స్థానిక నాలుగురోడ్ల కూడలి నుంచి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ విజయవాడ రోడ్డు, మచిలీపట్నం రోడ్డు, గుడివాడ రోడ్డుల మీదుగా కూడలికి చేరుకున్నది. అనంతరం వారు మాట్లాడుతూ.. మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. క్రైస్తవులకు రక్షణ కల్పించాలని కోరారు. భారతదేశం విభిన్న సంస్కృతులకు నిలయమని, అలాంటి దేశంలో ఈ విధంగా నిర్వహించడం హేయమైన చర్య అన్నారు. మండలంలోని పాస్టర్లు, సంఘ నాయకులు పాస్టర్ స్వర్ణన్ రాజు, కృపాసాగర్, పౌలురాజు, రవి, సునీల్, ఎస్.పాదం, క్రైస్తవులు పాల్గొన్నారు.

పెదపారుపూడి గ్రామంలో నిరసన

పెదపారుపూడి: మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రామంలో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో మణిపూర్ సంఘటనలపై ఆదివారం నిరసన ప్రార్థనలు నిర్వహించారు. సీఎస్ఐ, రక్షణ సైన్యం చర్చిల పాస్టర్లు కె.రాజేష్, మేజర్ విజయకుమార్‌లు గ్రామ వీధుల్లోనిరసన ర్యాలీలు చేపట్టారు. కార్యక్రమంలో సంఘస్తులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

మత విద్వేషాలను అరికట్టాలి

గుడివాడటౌన్: స్వాతంత్ర్య భారతదేశంలో మత స్వేచ్ఛ భంగం కలుగుతుంటే కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని సాహితీ స్రవంతి గుడివాడ శాఖ అధ్యక్షుడు లంకా సురేంద్ర విమర్శించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మణిపూర్ సంఘటనపై ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రెండు తెగల మధ్య ఆధిపత్య పోరును మత విద్వేషాలుగా సృష్టించి దాడులు జరుగుతుంటే కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని తుంగలో తొక్కిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో విలువైన ఖనిజ సంపదను ప్రైవేట్ వ్యక్తులకు దోచిపెట్టేందుకు ఈ దారుణాలు జరుగుతున్నాయని దీనిని ప్రతి భారతీయుడు ఖండించాలని కోరారు. కార్యక్రమంలో వసుధ బసవేశ్వరరావు, పీటర్, సాయిలక్ష్మి, మాల్యాద్రి, బి.విశ్వేశ్వరరావు, కె సురేష్, రాంబాబు, అవిర్నేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులను అరికట్టాలి

గుడివాడటౌన్: మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులను అరికట్టాలని ఆర్సీఎం ఫాదర్ ఎం.లూయిస్‌రాజు కోరారు. గుడ్‌మెన్ పేట విచారణ(ఆర్సీఎం చర్చి) ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోతిబొమ్మ సెంటర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ బస్టాండ్, మార్కెట్ సెంటర్, నెహ్రూచౌక్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఫాదర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో వ్యక్తి తన ఇష్టదైవాన్ని ఆరాధించుకోవచ్చునని, దానికి వ్యతిరేకంగా దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని అన్నారు. మణిపూర్‌లో క్రిస్టియన్‌లపై దాడులను ఖండిస్తున్నామన్నారు. కుకీ తెగకు చెందిన వారిపై, క్రైస్తవ మతస్తులపై దాడులు చేయడం, చర్చిలు కూల్చివేయడం అప్రజాస్వామికమని చెప్పారు. భారతదేశ చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడం విచారకరమన్నారు. వెంటనే ప్రభుత్వం దోషులపై కఠిన చర్యలు తీసుకుని క్రైస్తవులకు రక్షణ కల్పించేలా ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హోలీక్రాస్ సుపీరియర్ సిస్టర్ మేరీ కోయిలా, కౌన్సిల్ సభ్యుడు బెజ్జం సువర్ణరాజు, తోట బెనర్జీ, డెక్కా భూషణం, ఎం.జోజిబాబు, కంచెర్ల సుధాకర్, మెండా కిరణ్, పొంగులేటి జయరాజు, ఎస్ జోసఫ్, క్రైస్తవులు పాల్గొన్నారు.



పామర్రు కూడలిలో నిరసన వ్యక్తం చేస్తున్న క్రైస్తవులు



పెదపారుపూడిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు రాజేష్, విజయకుమార్



గుడివాడలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

దివ్యాంగులకు సేవ చేయడం వరం

ఎమ్మెల్యే కొడాలి నాని



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడటౌన్: దివ్యాంగులకు సేవ చేసే అవకాశం రావడం వరమని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. స్థానిక బంటుమిల్లి రోడ్డులో మార్వాడీ సత్రంలో ఆదివారం భారత్ వికాస్ పరిషత్ గుడివాడ శాఖ ఆధ్వర్యంలో కృత్రిమ అవయవాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ.. అనేక కారణాలతో అవయవాలు కోల్పోయిన దివ్యాంగులను చేరదీసి వారి జీవనం కొనసాగించడానికి అవసరమైన కృత్రిమ అవయవాలు అందజేయడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం కృత్రిమ అవయవాలు కొనుగోలు చేయడం ఎంతో ఆర్థికభారం పడుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరిని గుర్తించి వారికి అవసరమైన కృత్రిమ అవయవాలు అందజేయడం భారత్ వికాస్ పరిషత్ గొప్పదనమన్నారు. గత 28 ఏళ్లుగా సుమారు 1,800 పైబడి కృత్రిమ అవయవాలు ఏర్పాటు చేసిన గుడివాడ శాఖ సేవలు అభినందనీయమని చెప్పారు. తాను సైతం భారత్ వికాస్ పరిషత్ సభ్యుడనని రాష్ట్ర విభజన ముందు హైదరాబాద్‌లో భారత్ వికాస్ పరిషత్ కార్యాలయం ఉండేదన్నారు. అనంతరం దివ్యాంగుల సేవ కొరకు ఎక్కడా కార్యాలయం ఏర్పాటు చేయలేదని, భారత్ వికాస్ పరిషత్ గుడివాడ శాఖ వారు భవన నిర్మాణం చేపడితే పట్టణంలో 500 గజాల స్థలం ఇప్పించేందుకు ప్రభుత్వంతో చర్చించి ఒప్పిస్తామని చెప్పారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి వాడరేవు కామరాజు, కీర్తిలాల్ జైన్, వికాస్ పరిషత్ అమరావతి కన్వీనర్ రూప్‌చంద్ జైన్, రాష్ట్ర నాయకులు చోడవరపు విజయకుమార్, గుడివాడ శాఖ అధ్యక్షుడు జ్ఞానచంద్ జైన్, కార్యదర్శి ఎస్.శేషగిరిరావు, కోశాధికారి హారిక, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, సభ్యులు బొగ్గారపు తిరుపతయ్య, ఉరిటి రామారావు, ఉమాకుమార్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆర్టీసీ రాయితీ..

దివ్యాంగులకు ఆర్టీసీ ప్రయాణంలో 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు ఆర్టీసీ గుడివాడ ప్రతినిధి సీవీకే రావు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులు ఎక్కడకు ప్రయాణించినా ఏసీతో సహా అన్ని బస్సుల్లో 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. దివ్యాంగ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు ఫోటో తీసుకుని డిపోకు వస్తే ప్రత్యేక పాస్ ఇస్తామని చెప్పారు. దివ్యాంగుల శాతం అధికంగా ఉంటే ఒక తోడు ఉండే వ్యక్తికి సైతం ఈ రాయితీ వర్తిస్తుందని చెప్పారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం



రామచంద్రరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు

కొమరవోలు(పామర్రు): గ్రామాల్లో మునిగిన పొలాలను పరిశీలించే సాకుతో టీడీపీ ఇన్‌చార్జి వర్లకుమార్ రాజా ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని నీటి సంఘాల మాజీ అధ్యక్షుడు, కొమరవోలు పీఏసీఎస్ అధ్యక్షుడు శింగవరపు రామచంద్రరావు ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. వర్షాలకు నీటి మునిగిన పొలాలను పరిశీలించేందుకు వర్ల ఆదివారం కొమరవోలు వచ్చారన్నారు. వచ్చిన పని మర్చిపోయి స్థానిక ఎమ్మెల్యేపై ఇష్టం వచ్చినట్లు రాజకీయాలను మాట్లాడటం సరికాదని చెప్పారు. వేసవిలోనే గుర్రపు డెక్క, తూటికాడ, పూడిక తీత పనులను నిర్వహించి డ్రెయిన్‌ను శుభ్రం చేయించారన్నారు. ఈ కారణంగా మా గ్రామంలో డ్రెయిన్ సమస్యలు లేదని చెప్పారు. గ్రామంలోని పల్లపు ప్రాంతాల్లో ఉన్న పొలాలు ప్రతీ ఏడాది మునకకు గురవుతాయని, వర్షాలు తగ్గుముఖం పట్టగానే పొలాలు మామూలు స్థితికి చేరుకుంటాయన్నారు. ఈ విషయం తెలియని టీడీపీ నేత వర్ల ఈ విషయాన్ని అడ్డం పెట్టుకుని ఎమ్మెల్యేపై అవాక్కులు, చెవాక్కులు పేలితే గ్రామాల్లోకి కూడా రానివ్వమని హెచ్చరించారు. ప్రతి అంశాన్ని రాజకీయం చేయడం సరికాదని హితవు పలికారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి



మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యుడు వర ప్రసాద్‌బాబు

పామర్రు: వర్షాల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని జమీగొల్వేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు తులుమిల్లి వర ప్రసాద్‌బాబు సూచించారు. పామర్రులోని తమ్మాకోటమ్మరెడ్డి పాలిటెక్నికల్ కళాశాల ఆవరణలో సీజనల్ వ్యాధులు–జాగ్రత్తలు అనే అంశంపై మానవత సమావేశంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ.. నీటిని ఎక్కువగా సేవిస్తే అనారోగ్యం నుంచి దూరమవుతారన్నారు. కళ్ల కలకలు, కామెర్లు ఈ సీజన్‌లో ఎక్కువగా వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. ఏ చిన్నఅనారోగ్య సమస్య వచ్చిన సొంతగా వైద్యం చేయకుండా వెంటనే వైద్యుని సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పుస్తకాలను అందజేశారు. మానవత పామర్రు శాఖ అధ్యక్షుడు ఐవీఎస్ మనోహరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మల్లాది బుచ్చిబాబు, మానవత రీజియన్ చైర్మన్ పీఎంఎస్ ప్రసాద్, కార్యదర్శి పామర్తి వెంకట నారాయణ, కన్వీనర్ ఎస్.త్రివిక్రమరావు, ప్రతినిధులు వైఎస్ఎన్ ప్రసాద్, కొల్లా శ్రీనివాసరావు, డొక్కు సుబ్రహ్మణ్యం, మండపాక సుబ్బారావు, పొట్లూరి వెంకటేశ్వరరావు, తుంగల వేణుప్రసాద్ పాల్గొన్నారు.

మినిస్టీరియల్ ఎంప్లాయీస్ యూనియన్ నేత అప్పారావుకు సత్కారం



గుడివాడటౌన్: మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన కె.అప్పారావును ఘనంగా సత్కరించినట్లు ఎన్జీఓస్ అసోసియేషన్ గుడివాడ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు షేక్ ఫరీద్ బాషా, జి రాజేంద్రప్రసాద్‌లు తెలిపారు. గుడివాడ పంచాయితీరాజ్ కార్యాలయ ఉద్యోగిగా పనిచేస్తున్న అప్పారావు రాష్ట్ర స్థాయి నాయకునిగా ఎంపిక కావడం ఎన్జీఓస్ అసోసియేషన్‌కు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఎన్జీఓస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బండి శ్రీనివాస్, కె.శివారెడ్డిలు అప్పారావును సత్కరించినట్లు వారు తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం

ముదినేపల్లిరూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం – చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో జరిగే నిత్యాన్నదానానికి దాతలు ఆదివారం విరాళం అందించారు. విజయవాడకు చెందిన శంభంగి భాస్కరరావు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె శిరీష, అల్లుడు నాగప్రసాద్ రూ.1,00,005 విరాళాన్ని స్వామి సన్నిధిలో అందజేశారు. అదేవిధంగా గో సంరక్షణకు మండలంలోని కోమర్రుకు చెందిన కూనపురెడ్డి గంగాధరరావు, లీలారత్నకుమారి దంపతులు రూ.22,001 విరాళాన్ని అందించారు. ఆలయ చైర్మన్ కొంతి నాగరాజు, సహాయ కమిషనర్ నేల సంధ్య దాతలకు స్వామివారి శాలువాలు, చిత్రపటాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

పేకాట శిబిరంపై దాడి

మండవల్లి: మండలంలోని లింగాల గ్రామంలో ఒక ఇంటి షెడ్‌లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 11 మంది జూదరుల వద్ద నుంచి రూ.70,730 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. నిందితులపై 3, 4 ఏపీ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి సొంత పూచీకత్తులపై విడుదల చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కొచ్చెర్లకు తాగునీటి ట్యాంకర్



కైకలూరు: చెరువులో కొత్త నీరు నింపుతున్న నేపథ్యంలో కొచ్చర్ల గ్రామ ప్రజల తాగునీటి అవసరాల కోసం తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వాటర్ ట్యాంక్ ద్వారా నీటిని అందించారు. ఏలూరు జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కీర్తి వెంకట్ రామ్‌ప్రసాద్ ట్యాంకర్‌లో నీటిని ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్యపై గ్రామస్తుడు తలారి శేషగిరి తపన ఫౌండేషన్ అధ్యక్షుడు గారపాటి సీతారామంజనేయ చౌదరికి వివరించగా ఆయన వాటర్ ట్యాంకర్‌ను పంపించారన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జడ్డు వీర వెంకట సత్యనారాయణ, ప్రజలు పాల్గొన్నారు.

ధూళిపూడిపాలెం వద్ద తూము ఏర్పాటు



పమిడిముక్కల: మేడూరు శివారు ధూళిపూడిపాలెం వద్ద రహదారిపై తూమును ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలోని, పొలాల్లోని మురుగునీరు దిగువకు పారే అవకాశం ఏర్పడింది. ముంపు గ్రామాల్లో పర్యటనల్లో బాగంగా ఇటీవల ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ధూళిపూడిపాలెం గ్రామానికి వెళ్లారు. గ్రామస్తులు, రైతులు ఎమ్మెల్యే కైలేకు మురుగు నీటి సమస్యను వివరించారు. ఈ ప్రాంతంలో ఉన్న తూములు పూడిపోవడం వల్ల మురుగునీరు పారక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఎమ్మెల్యే కైలే ఆదేశాల మేరకు సర్పంచ్ గొర్రెపూడి స్వర్ణలత, వైఎస్సార్ సీపీ నాయకుడు గొర్రెపూడి బుజ్జి తూము ఏర్పాటు చేసి మురుగు నీటి సమస్యకు మోక్షం కల్పించారు.

ఆనందంగా ఫ్రెండ్‌షిప్ డే



గుడివాడటౌన్: గుడివాడ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. స్థానిక టీచర్స్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సంస్థ ప్రెసిడెంట్ దండమూడి జయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులు, సంస్థ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని పరస్పరం ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పీవీ శేషగిరిరావు, చైర్మన్ గుత్తా రమేష్, గుడివాడ శాఖ చైర్మన్ మారుతీ ప్రసాద్, సభ్యులు దండమూడి సీతారామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు సరుకులు అందజేత



గుడివాడటౌన్(నందివాడ): నందివాడ మండలం వెన్నపూడి గ్రామంలో వర్షాల కారణంగా ముంపునకు గురైన దళిత కాలనీ వాసులకు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎంపీపీ పెయ్యల ఆదాం మాట్లాడుతూ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) నీట మునిగిన బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ఈ ఏర్పాట్లు చేశారన్నారు. నిత్యావసర సరుకులు లేక ఇబ్బంది పడుతున్న 70 కుటుంబాల వారికి ఈ కిట్లు పంపిణీ చేశామన్నారు. కొన్ని ప్రాంతాల్లో భారీగా వర్షాలు రావడం, పైనుంచి వస్తున్న నీరు అధికంగా ఉండటంవలన కొన్ని ప్రాంతాల్లో వర్షం నీరు తిష్టవేసిందన్నారు. నీటిని తొలగించే కార్యక్రమం ముమ్మరంగా చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.భవన్నారాయణ, ఆర్ఐ గణేష్, సర్పంచ్ నాగబాబు, వైస్ సర్పంచ్ సుందరరావు, నాయకులు కందుల నాగరాజు, నీలం పండు పాల్గొన్నారు.